క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

నాగాయలంక: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని వక్కచివర సచివాలయం పరిధిలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా సహాయ ఫౌండేషన్ వార్షికోత్సవం



పెడన: నిరుపేదలకు సాయం చేస్తున్న సహాయ ఫౌండేషన్ ఏడో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 19వ వార్డులోని ఫౌండేషన్ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పేదలకు అందిస్తున్న సేవలను వివరించారు. లంకిశెట్టి బాలాజీ, మామిడి ప్రసాద్, అజయ్, సాయిరాం, బంటుమిల్లి, కృత్తివెన్ను కో ఆర్డినేటర్లు సుమంత్, కళ్యాణి పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని కల్యాణం



కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెం కృష్ణానది ఒడ్డున రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కల్యాణోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయ కమిటీ చైర్మన్ మత్తి ప్రమీలారాణి ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ సుధాకరరావు నేతృత్వంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మత్తి గురవయ్య, అంజనాదేవి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. గ్రామస్తులు పెద్దఎత్తున స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యాలమ్మ సన్నిధిలో అన్నసమారాధన



అవనిగడ్డ: మోదుమూడి గ్రామంలోని యాలమ్మ జాతరను పురస్కరించుకుని ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపించారు. విద్యుత్ దీప కాంతులతో అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ పెద్దలు పర్యవేక్షించారు.

లంకమ్మకు ఎమ్మెల్యే సింహాద్రి పూజలు



అవనిగడ్డ: గ్రామ దేవత లంకమ్మ తల్లి నెల సంబరం ఘనంగా జరిగింది. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ రీజనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అతిథులుగా విచ్చేసి సంబరాల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, కమిటీ పెద్దలు పర్యవేక్షించారు.

దేవాలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



యాగశాల ప్రారంభించి కలశ స్థాపనలు చేసిన వేద పండితులు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు తెనాలి ప్రధాన అయ్యప్ప దేవాలయం వ్యవస్థాపకుడు, యాజ్ఞికబ్రహ్మ బ్రహ్మశ్రీ దుర్భా హరిబాబు స్వామి బృందం ఆధ్వర్యంలో ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన యాగశాలకు మంగళవాయిద్యాల నడుమ శ్రీకారం చుట్టారు. 16 జంటలు హోమగుండాల వద్ద పీటలపై కూర్చుని హోమ పూజలు చేశారు. వేద పండితులు, రుత్వికుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు ప్రధాన అగ్నిస్థాపక పూజలు చేశారు. సర్పంచి మండలి ఉదయభాస్కర్, పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి చంటి, గణపేశ్వరం దుర్గమ్మ దేవస్థానం ధర్మకర్త మండల రాంబాబు, ముమ్మారెడ్డి సత్యనారాయణ, మెండు సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి జాతర

నాగాయలంక: గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజుల పాటు జరిగిన మండవ వారి గంగమ్మ తల్లి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ, జాతర మహోత్సవం ఆదివారం తెల్లవారు జామున ముగిసింది. ఆలయ కమిటీ చైర్మన్ మండవ మధుసూదనరావు (బుజ్జి) పర్యవేక్షణలో శనివారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. అనంతరం అమ్మవారి ఘటం గుడికి చేరడంతో జాతర సంప్రదాయాలతో భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఫిషింగ్ హార్బర్ పనుల పరిశీలన



ఫిషింగ్ హార్బర్ పనులు పరిశీలిస్తున్న మూడో డివిజన్ ప్రజలు

మచిలీపట్నంటౌన్: గిలకలదిండి సముద్ర తీరాన జరుగుతున్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను ఆదివారం పలు డివిజన్లకు చెందిన ప్రజలు సందర్శించారు. వారి డివిజన్లలోని సచివాలయాల నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్‌లలో వారంతా గిలకలదిండిలోని పాత ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్నారు. సముద్రంలోకి బండరాళ్లతో నిర్మిస్తున్న దక్షిణ, ఉత్తర గోడల పనులను పరిశీలించారు. అలాగే సముద్రపు ఒడ్డున ఉన్న మెరక ప్రాంతంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నగరంలోని 3, 37, 15 డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు శీలం భారతి, ఐనం తాతారావు, మహ్మద్ షహనాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ శీలం బాబ్జీ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఉల్లిపాలెంలో కుంభాభిషేక మహోత్సవాలు



యాగశాలలో పూజలు చేస్తున్న వేద పండితులు

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. గ్రామంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయ నిర్మాణం జరిగి 12 సంవత్సరాలు పూర్తి కావడంతో మహా కుంభాభిషేక ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం ఉదయం అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామీజీ పర్యవేక్షణలో వేద పండితులు స్వామివారి ఉత్సవ మూర్తులకు తిరుమంజనసేవ నిర్వహించారు. నమ్మాళ్వార్లు, రామానుజాచార్యుల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. శ్రీమన్నారాయణుడి 11అడుగుల ఏకశిలా మూలమూర్తికి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేక అలంకారం చేశారు. ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలో హోమాలు నిర్వహించారు. కుంభాభిషేక ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 12న ఆలయం వద్ద లక్ష మందికి అన్నసమారాధన నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఏర్పాట్లను అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ శ్రీనివాస్‌లు పరిశీలించారు. ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులను డీఎస్పీ ఆదేశించారు.

ముగిసిన లక్ష్మీనారాయణ స్వామి ఉత్సవాలు



మహా పూర్ణాహుతి సమర్పిస్తున్న వేద పండితులు

అవనిగడ్డ: ప్రాచీన దేవస్థానం లక్ష్మీనారాయణ స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం మహా పూర్ణాహుతితో ముగిశాయి. ఆగమ పండితులు దీవి పార్థ వెంకట్రామ శ్రీనివాసా చార్యులు బ్రహ్మత్వంలో దేవదాయ శాఖ ఈఓ పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు జరిగాయి. బలిహరణ, బృహస్పతి పూజ జరిపించి మహా పూర్ణాహుతి సమర్పించారు. అర్చక స్వాములు దీవి వెంకట్రామాచార్యులు, అప్పలాచార్యులు, దీవి రఘు, వాసుదేవకృష్ణ, మనోజ్ యాగాది క్రతువులు నిర్వహించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(తోట్లవల్లూరు): అకాల వర్షాలతో పంటలు నష్ట పోయిన రైతులకు అండగా ఉంటూ ఆదుకుంటామని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరు గ్రామంలోని ది సౌత్ వల్లూరు కో ఆపరేటివ్ కన్స్యూమర్ సొసైటీలో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి అమ్మకాలు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలకే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతులకు ఏ సీజన్‌లో నష్టం ఏర్పడితే అదే సీజన్‌లోనే పరిహారం అందించి రైతులకు అండగా ఉండడమే ఈ ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ఏ ఒక్కరైతు పరిహారం అందలేదని, పంటలు కొనుగోలు చేయడం లేదన్న మాటే రాకూడదని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పొలాల్లో పంటల ఎన్యూమరేషన్ చేయాలన్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను త్వరిత గతిన పంపాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని రైతులకు ఏమైన అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చి తగు విధమైన న్యాయం పొందవచ్చన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ రావులపల్లి వాసు, నాయకులు ఈఎస్ కోటేశ్వరరావు, ఈడ్పుగంటి రూబేన్, మోర్ల పూర్ణ ప్రసాద్, సోలే నాగరాజు, పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు

మొవ్వ: ఏపీ మార్క్ ఫెడ్ సంస్థ ద్వారా మొవ్వ గ్రామంలోని పీఏసీఎస్‌లో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎంఏఓ కె. శివ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ధాన్యంలో తేమ 14 శాతంలోపు ఉండేటట్లుగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాన్ని సంప్రదించాలని, క్వింటా ధర రూ.1962 చెల్లిస్తున్నట్లు వెల్లడించారు., మొక్క జొన్న అమ్మాలనుకున్న రైతులు ఆయా గ్రామాల్లో ఆర్‌బీకేల్లో ముందుగా సీఎం యాప్‌లో రిజిస్టరు చేయించుకుని, మొవ్వ పీఏసీఎస్‌కు రావాలని సూచించారు.

వాకర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం

గుడివాడ టౌన్: ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ 26వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ పూర్ణచంద్రరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ ఫౌండర్ అళ్వార్‌దాస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నడక ఆరోగ్యానికి మంచిదనే విషయాన్ని గుర్తించి అళ్వార్‌దాస్ ఏర్పాటు చేసిన అసోసియేషన్ అంతర్జాతీయంగా నడకను ప్రజలకు అలవరుస్తుందని అసోసియేషన్ సభ్యులు అన్నారు. వాకర్స్ జిల్లా గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు, సెక్రటరీ పీవీడీ ప్రసాదు, కోశాధికారి కె.సాయిబాబు, మాజీ గవర్నర్ బొగ్గారపు తిరుపతయ్య, డెప్యూటీ గవర్నర్ మల్లిక్, క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నారాయణరెడ్డి, కార్యదర్శి శివ, మహిళ అధ్యక్షురాలు రమ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడవద్దు



గుడివాడ టౌన్: నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడొద్దని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ శ్రీకాంత్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ప్రజల అవసరాలు తీర్చడంలో ఎంతో కృషి చేస్తోందని, శాంతి భద్రతల విషయంలో కూడా అదేతీరు కొనసాగించాలని అన్నారు. ప్రజలకు మంచి జరిగే విధంగా పోలీసులు వ్యవహరించాలని ఆయన సూచించారు.

అంకమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం



పెడన: ఉప్పల కలువగుంట గ్రామంలో గ్రామ దేవత అంకమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామ కమిటీ, పెద్దలు ఈ ఉత్సవాలను పర్యవేక్షించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అమ్మవారిని దర్శించుకుని, గ్రామ కమిటీలను, పెద్దలను కలిసి ఉత్సవాలపై ఆరా తీశారు. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 11వ తేదీ వరకు జరుగుతాయని కమిటీ వారు మంత్రికి వివరించారు.

ముగిసిన బలుసులమ్మ జాతర ఉత్సవాలు



బంటుమిల్లి: మల్లేశ్వరం గ్రామ దేవత బలుసులమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారం వేడి నైవేద్యాల సమర్పణతో ఘనంగా ముగిశాయి. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఉత్సవాలు ఈ నెల 3వ తేదీన ప్రారంభమయ్యాయి. గత ఐదు రోజులుగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఘటాలతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. చివరిరోజు ముగింపు సందర్భంగా గ్రామస్తులు బంధువులతో కలిసి అమ్మవారికి పోతులు, కోళ్లతో గుడి చుట్టూ తిరిగి వేడి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీకి చెందిన పలువురు నాయకులు పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ సీహెచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ పి. వీరబాబు, మాజీ సర్పంచ్ కె.నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ జె. కొండలరావు, మన్నె బుజ్జి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బీరయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ



బంటుమిల్లి: పెదతుమ్మిడి గ్రామంలో కుర్మల ఆరాధ్య దైవం బీరయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. పండితుల వేద మంత్రాల మధ్య విగ్రహ ప్రతిష్ఠ పూజ కార్యక్రమంలో హైదరాబాద్ రాచకొండ పోలీసు కమిషనర్ వెలివెల సత్యనారాయణ, ఎంపీపీ వెలివెల చినబాబు, జిల్లా లేబర్ కమిషనర్ మేకా శ్రీమన్నారాయణ, భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

65 మందికి నేత్ర వైద్య పరీక్షలు

చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం, ఉచిత కంటి పరీక్షా శిబిరం స్థానిక క్లబ్ కార్యాలయంలో నిర్వహించారు. డాక్టర్ మోహనరావు 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 23 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. క్లబ్ అధ్యక్షులు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు శిబిరాన్ని పర్యవేక్షించారు.

విద్యార్థినికి సన్మానం

పెడన: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పెడన మండలంలో టాపర్‌గా నిలిచిన అబ్దుల్ కౌసర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కౌసర్ తండ్రి అబ్దుల్ కరీం కుమార్తె అబ్దుల్ కౌసర్ స్థానిక కళాంజలి హైస్కూల్‌లో పదో తరగతి చదివింది. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో పెడన మండల టాపర్‌గా నిలిచిందని వైఎస్సార్ సీపీ పెడన పట్టణ కన్వీనర్ బండారు మల్లి అన్నారు. విద్యార్థిని కౌసర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎండీ మతీన్, కోడూరు శ్రీను, నూరుల్లా, మీర్‌బాబు, బాష తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కౌసర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంత్రి రోజాకు ఘన స్వాగతం



మంత్రి రోజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం పర్యటనకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి ఆర్‌కే రోజాకు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ జాషువా మంత్రి రోజాకు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం అతిథిగృహంలో మంత్రి జోగి రమేష్, ముఖ్యమంత్రి కార్యక్రమాల కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని తదితరులతో చర్చించారు. కార్యక్రమంలో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ సునీల్‌బాబు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

చేవేంద్రలో పాల కేంద్రం భవనం ప్రారంభం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఆంజనేయులు

పెడన: చేవేంద్ర పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం నూతనంగా నిర్మించిన పాల కేంద్రం భవనాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందన్నారు. 2022–23 ఏడాదికి పాల ధరను రూ.8 లకు పెంచామని చెప్పారు. ఇదే ఏడాదికి మూడు విడతలుగా రూ.55 కోట్లను బోనస్‌గా పంపిణీ చేశామని వివరించారు. యూనియన్ జిల్లా పాలకవర్గ సభ్యుడు అర్జా వెంకట నగేష్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నల్లమోతు సూర్యప్రకాశరావు, పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, ఎంపీటీసీ అంకెం నరసింహారావు, చేవేంద్ర పాల సంఘ కేంద్రం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

పేర్ని నానిని కలిసిన ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు



పేర్ని నానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)ని మచిలీపట్నం డివిజన్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫొటోగ్రాఫర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను నాని దృష్టికి తీసుకువచ్చారు. తమ అసోసియేషన్‌కు భవనం నిర్మాణం కోసం స్థలాన్ని, నిధులను కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. సంఘ అధ్యక్షులు చిలంకుర్తి నాగభూషణం, కార్యదర్శి వంకా అనంత్, నాయకులు ఆత్మూరి నాగబాబు, హరి, సాయిఫణి, శ్రీనివాస్, స్వామి, వాసు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం



అవనిగడ్డలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లైబ్రేరియన్ ప్రభుదాస్

కోడూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి పుష్పలత ఆదివారం తెలిపారు. శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనంలో మెలకువలు, బొమ్మల తయారీలో శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు గ్రంథాలయంలో సంప్రదించాలని పుష్పలత కోరారు.

పెడన గ్రంథాలయంలో..

పెడన: పెడన శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం నుంచి నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి కేవీవీఎస్ బసవేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 16వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్లామర్, డ్రాయింగ్, పెయింటింగ్, నీతి కథలు, పాటలు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి నిపుణులతో శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

అవనిగడ్డ: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు స్థానిక గ్రేడ్–1 గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు గ్రంథాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. 6–10 తరగతుల విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు, ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ పాల్గొన్నారు.